క్లుప్తంగా

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



తాడేపల్లి రూరల్: రైతులకు అందాల్సిన ఎరువులపై అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి ఆర్.శశిధర్ స్పష్టం చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు హోల్‌సేల్ ఫర్టిలైజర్ గోడౌన్స్, దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు షాపులలో స్టాక్ రికార్డులు, ఓ ఫామ్స్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు కలిగి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రంజిత్‌కుమార్, విజయవాడ అర్బన్ అగ్రికల్చర్ అధికారి తేజస్విని, తాడేపల్లి మండల అగ్రికల్చర్ అధికారిణి పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కార్మెల్ మాత ఉత్సవాలు



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ భగవంతుడిపై భక్తి, ప్రేమలను కలిగి ఉండాలని ఫాదర్ వై.అంతోనిరాజు అన్నారు. మండల కేంద్రంలోని కార్మెల్ మాత ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా కొండపై ఉదయం దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ వాక్యోపదేశం చేశారు. సాయంత్రం కార్మెల్ కొండవద్ద రేపల్లె విచారణ గురువులు పి.జోజిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు. ఉత్సవాల మొదటి రోజు కొండ ప్రాంతం అంతటా సందడి వాతావరణం నెలకొంది. కొండ వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. బాల ఏసుదేవాలయ ప్రాంగణం రంగుల రాట్నాలు, పలు రకాల దుకాణాలతో దర్శనమిస్తోంది.

విద్యార్థిని చదువుకు చేయూత



మంగళగిరి టౌన్: విద్యార్థిని చదువుకునేందుకు రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్‌కుమార్ చేయూతను అందించారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర సమాచార కార్యాలయంలో సోమవారం విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. గుంటూరు నగరానికి చెందిన సాయిలక్ష్మి అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల విద్యార్థిని సాయిలక్ష్మి తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుటుంబం ఆర్థికంగా వెనుకబడింది. దీంతో ఆమె చదువుకునేందుకు సునీల్‌కుమార్ వీర్రాజు, శ్వేతల సహకారంతో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్లను బిగించవద్దు అంటూ సోమవారం మహానాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మోసపు మాటలు చెప్పి స్మార్ట్ మీటర్లు బిగించడానికి వచ్చే మోసగాళ్లను నిలదీయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే శాశ్వతంగా ప్రజలపై భారాలు పడతాయని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలకొట్టమని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.వి.భాస్కర్‌రెడ్డి, నార్ని నాగేశ్వరరావు, వై.బర్నబాస్, రామారావు, మేరీ, గిరిజ, ఉష, శ్రీలక్ష్మి, ప్రభాకర్, బాష, వీర కుమారి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దుగ్గిరాల: దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ఉంటుందని.. కార్యక్రమానికి షేక్.జబీన్ అధ్యక్షులుగా ఉంటారని ఆయన తెలిపారు.

అధికారం ఇచ్చింది దాడులు చేయడానికి కాదు

- ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేశారు?
- కూటమి నాయకులు ఆత్మవిమర్శ చేసుకోండి
- ఇచ్చిన హామీలను అడుగుతున్నందుకే దాడులు
- రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలి
- మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారం ఇచ్చింది ప్రజా పరిపాలన చేయడానికి కానీ.. హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై దాడులు చేయడానికి కాదని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్‌లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేమారెడ్డి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

అక్రమ కేసులు సిగ్గుచేటు..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చేస్తున్న అరాచకాలపై ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని వేమారెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు వంచించారని ఆయన మండిపడ్డారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో ప్రజలకు న్యాయం చేయాలని బాబు రీకాల్ మేనిఫెస్టో పేరుతో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమానికి పిలుపునిచ్చారని అన్నారు. కూటమి నాయకులు తమ వైఫల్యాలు ప్రజలకు తెలిసిపోతాయని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులపై దాడులకు పాల్పడడం అమానుషమని వేమారెడ్డి పేర్కొన్నారు.

డోలాస్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు, తాడేపల్లి ఉపాధ్యక్షులు జీలగ పెదగాలయ్య, వేల్పుల ఎలీషా, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిట్టిమళ్ల స్నేహసంధ్య, షేక్ సర్దార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు



మాట్లాడుతున్న ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు, గుండాలపాడు, వేములూరిపాడు, అమీనాబాద్, మేరికపూడి గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పూషాడపు శివసుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 0–6, 6–15 ఏళ్ల వయస్సు గల వారికి నూతన ఆధార్ రిజిస్ట్రేషన్, ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. యర్రగుంట్లపాడు సచివాలయంలో 15వ తేదీ నుంచి 18 వరకు.. వేములూరిపాడు ఉర్దూస్కూల్, అమీనాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 22వ తేదీ నుంచి 25 వరకు.. గుండాలపాడు సచివాలయంలో 15వ తేదీ నుంచి 18 వరకు.. మేరికపూడి సచివాలయంలో 22వ తేదీ నుంచి 25 వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సచివాలయం సిబ్బంది డీఏలు జి.సునీత, ఎస్.విజయభాస్కర్, మహిళాపోలీసులు బి.సుందరి, ఎం.శాంతి, ఎం.అనిత, ఎ.గాయత్రిలు విధులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి సమ్మె ఉద్ధృతం చేస్తాం



మాట్లాడుతున్న ఎస్ఎస్ చెంగయ్య

మంగళగిరి టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16వ తేదీ నుంచి సమ్మెను ఉద్ధృతం చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. సోమవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలియజేశారు. బుధవారం నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేషన్ ఫెడరేషన్ అధ్యక్షురాలు కె.వెంగమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి నాయకులు బి.వెంకటేశ్వర్లు, రాజధాని సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు ఎం.రవి, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, మంగళగిరి మండలం రూరల్ కార్యదర్శి దుర్గారావు, ఫెడరేషన్ నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, వై.శివనాగేశ్వరరావు, బాబూరావు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రసంగిస్తున్న ఉమా మహేశ్వరరావు

మంగళగిరి టౌన్: ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుభూతి మాటలతో గందరగోళ పరుస్తోందని.. వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు అన్నారు. సమస్యలను పరిష్కరానికి మంగళగిరి కార్పొరేషన్ ఎదుట నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి అనేక సార్లు సమస్యలను వివరించామని అన్నారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ.. సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని అన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ.. సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీను సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వీవీ జవహర్‌లాల్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, వి.శ్రీనివాసరావు, ఎస్.నాగరాజు, కె.శ్రీనివాసరావు, పి.రాము, కేధార్‌నాథ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

కళారంగానికి కోట మృతి తీరని లోటు

తాడేపల్లి రూరల్: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటు అని సినీ, నాటక రంగ సీనియర్ కళాకారులు ఉండవల్లి పార్థసారధి, జొన్న రామలింగేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత్ర ఏదైనా తన నటనతో ప్రేక్షకులను అలరించారని అన్నారు. పిసినారిగా నటించినా.. విలన్‌గా అలరించినా.. కన్నీరు పెట్టించే విషాద పాత్రల్లో నటించినా.. ఆయనకు ఆయనే సాటి అని, కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గుంతలు లేని రోడ్లే లక్ష్యం

- మంత్రి నారా లోకేష్
- 100 రోజుల్లో పనులు పూర్తిచేస్తాం



పాత్ హోల్ రిపేర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఐదు అధునాతన వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థను నంబర్ ఒన్‌గా తీర్చిదిద్దేందుకు రు. 4.40 కోట్ల వ్యయంతో ఐదు అధునాతన వాహనాలను సమకూర్చామని తెలిపారు. ఇందులో చెత్తను తరలించేందుకు రెండు రిఫ్యూజ్ కాంపాక్టర్ మెషీన్ వాహనాలు, రెండు స్వీపింగ్ మిషన్ వాహనాలు, బీటీ రహదారుల్లో గుంతలు పూడ్చే అధునాతన పాత్ హోల్‌రోడ్ రిపేర్ వాహనం అని పేర్కొన్నారు. చెత్తను తరలించేందుకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో వినియోగిస్తున్న రూ. 1.91 కోట్ల విలువైన రెండు కాంపాక్టర్ వాహనాలను రాష్ట్రంలోనే మొదటిసారిగా మంగళగిరి నగరపాలక సంస్థకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. బీటీ రోడ్లపై ఎప్పటికప్పుడు గుంతలు పూడ్చేందుకు రూ. 1.48 కోట్ల విలువైన పాత్ హోల్ రిపేర్ వాహనంతో పాటు రూ. 1.2 కోట్ల విలువైన రెండు స్వీపింగ్ మిషన్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మంగళగిరిని గుంతలు లేని రోడ్ల నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు 100 రోజుల చాలెంజ్‌ను అధికారులు స్వీకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ఔషధ మొక్కల ప్రభావం అధికం



ఔషధ మొక్కలు నాటుతున్న చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు

మోతడక చలపతి ఫార్మశీలో ఔషధ వనం ప్రారంభం

మోతడక(తాడికొండ): ఆరోగ్యంపై ఔషధ మొక్కల ప్రభావం అధికంగా ఉంటుందని.. వాటిని పెంచి జీవన యానంలో వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మోతడక చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మశీలో సోమవారం జరిగిన ఔషధ వనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు ఔషధ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరో అతిథి వినయ్ మాట్లాడుతూ.. ఆరోగ్యానికి తోడ్పడే మొక్కల్ని వివిధ రోగాలు నివారించే విధానంపై వివరించి ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని వెంకట రామారావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

- ఆయన క్షేమమే మా లక్ష్యం
- గుమ్మడికాయలతో దిష్టి తీసిన మహిళలు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు



దిష్టి తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజాదరణ తగ్గలేదని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి తాడేపల్లిలోని తన నివాసానికి రావడంతో నరదిష్టి తీసేందుకు భారీగా మహిళలు, లీగల్‌సెల్ నాయకులు గుమ్మడికాయలతో అక్కడకు చేరుకున్నారు. ఆయన రాగానే గుమ్మడికాయలపై కర్పూరం వెలిగించి దిష్టి తీశారు. ఈ సందర్భంగా లీగల్‌సెల్ నాయకులు బరిగెల కోటేష్, విజయవాడకు చెందిన మహిళా నాయకురాలు ప్రేమ్ త్రివేణి రెడ్డిలు మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్నా, పక్క రాష్ట్రంలో ఉన్నా పచ్చ మీడియాతో పాటు కూటమి నాయకులు రోజూ చర్చించుకుంటున్నారని.. ఆయనకు నరదిష్టి తగలకూడదనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న వంగర సురేష్

మంగళగిరి టౌన్: విద్యార్థులు, నిరుద్యోగులు నైపుణ్యత పెంచుకునేందుకు ఎస్ఏపీఎస్‌డీ శిక్షణ తరగతులు దోహదపడతాయని మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వంగర సురేష్, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కొండలరావు అన్నారు. మానవ సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కొండలరావు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సురేష్ మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారు, వివిధ రంగాల్లో ఉన్న నిపుణులు ఈ కోర్సులు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. తాడేపల్లిలోని మానవ సేవా సంస్థ కార్యాలయంలో ప్రతి శని, ఆదివారాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కొండలరావు కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దేవరకొండ సురేష్, చింత విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న అజయ్ కుమార్

మంగళగిరి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం.. కార్మిక, కర్షక శ్రేయస్సు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆత్మకూరు గ్రామంలో నిర్మల కాలేజ్ దగ్గర జరిగిన సీపీఐ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు లభించేలా చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎర్రజెండాను సీనియర్ నాయకులు కళ్లం మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సభకు మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, శాఖాధ్యక్షుడు జాలాది విజయేందర్‌రావు నేతృత్వం వహించారు. నాయకులు చిన్ని తిరుపతయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు దినేష్ సీరంగారాజు, బందెల నాసర్‌జి తదితరులు పాల్గొన్నారు.

223వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం నాటికి 223వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని కేసీ వర్క్స్ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావులు సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును ఏ కోర్టులో అప్పీలు చేసే వీలు లేదని.. అది తప్పక అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాషా, సాంబశివరావు, ఆశీర్వాదం, గురవయ్య, కార్మికులు వై.రమాదేవి, రిబ్కా, శారమ్మ, ఇమాంబి, దర్శి నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. అల్లంవారి పాలెం, వసంతనగర్, ఆరోగ్యనగర్, జగనన్న హౌసింగ్ కాలనీ 1, 2, 3, 4 ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉప్పాల హారికపై దాడి హేయమైన చర్య

మంగళగిరి టౌన్: కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికపై కొందరు దుండగులు దాడి చేయడాన్ని, హారిక దంపతులను అప్రజాస్వామికంగా ఇబ్బందులకు గురిచేయడాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్‌లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జిల్లా స్థాయిలో ఉన్నతాధికారిగా ఉన్న ఒక బీసీ మహిళపై దుండగులు దౌర్జన్యానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. పోలీసులు పార్టీల కోసం కాకుండా, చట్టాలకు లోబడి పని చేసేలా స్వతంత్ర వ్యవస్థగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



దుగ్గిరాల: రేవేంద్రపాడు కొత్త కాలనీలో సుమారు 720 మీటర్లు గల అంతర్గత రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ షేక్ జబీన్ మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులు సుమారు రూ.16 లక్షల వ్యయంతో రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, కె.శ్రీ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జెండా ఆవిష్కరణ



దుగ్గిరాల: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జెండా ఆవిష్కరణ వేడుకను దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ సుధీర్‌బాబు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. డి.కె.సుబ్బారెడ్డి, ఉన్నం ప్రసాద్, ఎం.మోహన్‌కృష్ణ, ఎం.శ్రీధర్, బి.మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: కాలువల్లో మురుగు పారడం లేదు.. రోజూ వీటిని బాగు చేస్తున్నా ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడిందంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పట్టణంలోని 31వ వార్డులో సోమవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కాలువల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని మురుగు కాలువలు పారుదల జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి, ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ద్వారా ప్రయోజనాలు

తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు కప్పల రాజారెడ్డి పేర్కొన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన క్రమశిక్షణ, న్యాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సమాజసేవ వంటివి అలవడతాయని చెప్పారు. అలాగే విద్య, ఉద్యోగ అవకాశాల్లో రెండు శాతం రిజర్వేషన్లు కూడా లభిస్తాయన్నారు. అనంతరం 55 మందిని ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ అధికారి పరిశా సర్ధార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండూరు శ్రీనివాసరావు, అంబరీషుడు, 22వ ఆంధ్రా బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.